క్లుప్తంగా

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు రూ.50 వేల విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు సోమవారం ఓ భక్తుడు భారీ విరాళం అందించారు. పోరంకి గ్రామానికి చెందిన దేవునిపల్లి రాంబాబు, పద్మావతి దంపతులు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ దాతను అభినందించారు. ఆలయం వద్ద ప్రతిరోజూ వందల మంది భక్తులు నిత్యాన్నదానంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తాళ్లరేవు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. తాళ్లరేవు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ కుమార్, తాళ్లరేవు ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బంది తూరంగి ల్యాబ్‌టెక్నీషియన్ తూరంగి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారని ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ తెలిపారు.

క్షమా గుణాన్ని అలవర్చుకోవాలి

అమలాపురం టౌన్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సీవీ రామన్ స్కూల్లో ప్రపంచ క్షమా దినోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులతో వాకర్స్ ప్రతినిధి పేరి లక్ష్మీ నరసింహం క్షమా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి మనిషి సహనంతో క్షమా గుణాన్ని కలిగి ఉంటే అన్నీ సానుకూల పరిస్థితులే ఎదురవుతాయని పేర్కొన్నారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, వాకర్స్ క్లబ్ కోశాధికారి పడాల వెంకటేశ్వరనాయుడు, ప్రిన్సిపాల్ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ పరిశ్రమలో మాక్‌డ్రిల్

తాళ్లరేవు: గాడిమొగలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో వివరిస్తూ మాక్‌డ్రిల్ ద్వారా తెలియజేసారు. కాకినాడ జిల్లా కర్మాగారాల తనిఖీ విభాగం వారి ఆదేశాల మేరకు ట్రక్ లోడింగ్ ఫెసిలిటీ వద్ద గ్యాస్‌లీక్ అంశంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, రాంబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజశేఖర్, ఓఎన్‌జీసీ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధికారులు పర్యవేక్షించారు.

సచివాలయం ఏఎన్‌ఎంలకు రీ కౌన్సెలింగ్ నిర్వహించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సచివాలయం ఏఎన్‌ఎంలు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాకు సంబంధించి వివిధ గ్రామాల చెందిన సచివాలయాల్లో పనిచేస్తున్న 26 మంది ఏఎన్‌ఎంలు మెరిట్ లిస్ట్‌లో ఉన్నా వారి పేర్లు పదోన్నతి కౌన్సెలింగ్‌లో లేకపోవడం అన్యాయమని, రీ కౌన్సెలింగ్ నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని దళిత, బహుజన మహిళా శక్తి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. దళిత, బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,452 మంది సచివాలయం ఏఎన్‌ఎంలలో మెరిట్ లిస్టులోని 390 మందికి పదోన్నతి కల్పించారని తెలిపారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి సొంత మండలం నుంచి వేరే మండలానికి పదోన్నతి కల్పించకుండా బదిలీ చేశారని సచివాలయం ఏఎన్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా నార్మదాకుమారి, గుత్తుల నాగమణి, ముమ్మిడివరపు మంగాలక్ష్మి, చిత్రపు ఉమాదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు అందజేత



అంగన్‌వాడీ సిబ్బందికి టీవీ అందజేస్తున్న ఎంపీ, హరీష్, ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం: మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 84 అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలను సోమవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథూర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, సీడీపీఓ ఎం.నిహారిక పాల్గొన్నారు.

ఆక్వా చెరువులతో అనర్థాలు

- తీరంలో పెరిగిన ఆక్వా సాగు
- పచ్చని కోనసీమ ప్రాంతంలో పర్యావరణానికి చేటు
- యథేచ్ఛగా చెరువుల తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు



ఓడలరేవులో ఓఎన్‌జీసీ టెర్మినల్ ఆనుకుని సముద్రానికి పది మీటర్ల దూరంలో తవ్విన చెరువులు



వాసాలతిప్పలో సరుగుడు తోటల్లో ఇసుక తవ్వకాలు

అల్లవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సముద్రం తీరం వెంబడి అనధికారికంగా సాగుతున్న ఆక్వా సాగుతో పచ్చని కోనసీమ ప్రాంత పర్యావరణం దెబ్బతింటోంది. కొంతకాలంగా తీరం తన ఉనికికి కోల్పోయింది. ఉన్న కొద్దిపాటి తీరాన్ని ఆక్వా రైతులు, వ్యాపారులు తమ స్వార్థానికి నాశనం చేస్తున్నారు. తీరం పొడవున సునామీలు, భారీ తుఫాన్ల నుంచి రక్షణగా ఉన్న సరుగుడు, జీడిమామడి తోటలు, తాటిచెట్లను కూకటి వేళ్లతో పెకలించి చెరువులు తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. నేడు ఓడలరేవు తీరంలో మచ్చుకైనా సరుగుడు తోటలు కనిపించడం లేదు. వైనతేయ నది సముద్రంలో కలిసే నదీ ముఖద్వారం నుంచి సముద్ర రిసార్ట్స్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా సరుగుడు తోటలను పెకలించి ఆక్వా చెరువులు పుట్టుకొచ్చాయి. తీరంలోని సరుగుడు తోటలను తొలగించడంతో ప్రకృతి వైపరీత్యాల నుంచి, భారీ కెరటాలకు నేల కోతకు గురికాకుండా కాపాడే రక్షణ వ్యవస్థ కనుమరుగైంది. భారీ వర్షాలు, తుఫాన్ల సమయంలో తీరం భారీగా కోతకు గురై సముద్రం ముందుకు వస్తోంది.

ఓఎన్‌జీసీ టెర్మినల్ పొడవునా చెరువుల తవ్వకాలు

ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ పొడవునా నేడు రొయ్యల చెరువులు పుట్టుకొచ్చాయి. ఉన్న కొద్దిపాటి తీరాన్ని ఆక్వా రైతులు రొయ్యల చెరువులుగా తవ్వేశారు. గత నెలలో పది రోజుల పాటు అనధికారికంగా చెరువులు తవ్వుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. తీర ప్రాంతానికి 500 మీటర్ల వరకు (సీఆర్‌జెడ్ పరిధి) ఎలాంటి తవ్వకాలు చేయరాదని నిబంధనలున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సముద్ర తీరానికి కేవలం 10 మీటర్ల దూరంలో ఆక్వా రైతులు యథేచ్ఛగా చెరువుల తవ్వకాలు పూర్తి చేసుకుని రొయ్యల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఓడలరేవు నుంచి కొమరగిరిపట్నం తీరం పొడవునా సీఆర్‌జెడ్ పరిధిలోని భూముల్లో అక్రమంగా చెరువులు తవ్వకుని రొయ్యల సాగు చేస్తున్నా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కొమరగిరిపట్నం బీచ్‌కు సమీపంలో ఇసుకను తరలించి, చెరువులు తవ్వి కొందరు ప్రయోజనం పొందుతున్నారు. ఈ చెరువుల పక్క నుంచి సముద్ర లోతు జలాల్లోంచి ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు అధిక ఒత్తిడి గల గ్యాస్ పైప్‌లైన్ వెళ్లింది. ఇవేమీ లెక్క చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా చెరువుల తవ్వకాలు సాగిస్తున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు

ఉప్పలగుప్తం మండలంలో వాసాలతిప్పలో రాత్రి వేళలో ఇసుకను ట్రాక్టర్లపై తరలించారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల మాటున అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లో తీరంలోని ఇసుకను తవ్వి తరలించారు. కూటమి నాయకుల ఆగడాలు పెచ్చుమీరినా రెవెన్యూ, మత్స్యశాఖ, పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీరంలో అనధికారికంగా సాగుతున్న రొయ్యల సాగు, ఇసుక దందాపై అధికారులు చర్యలు తీసుకోకపోతే ఓడలరేవు గ్రామస్తులు భారీ మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి ఎదురవుతుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవాన్ని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో విధిగా హాజరు కావాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పార్టీ పిలుపు మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు అల్లవరం మండలం కోడూరుపాడులో నిర్వహించే వైఎస్ జయంత్యుత్సవంలో డాక్టర్ శ్రీకాంత్ పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు అమలాపురం హైస్కూలు సెంటరులోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తారు. ఉద యం 11 గంటలకు అమలాపురం రూరల్ మండలం బండార్లంకలో నిర్వహించే జయంత్యుత్సవానికి హాజరవుతారు. ఉదయం 11 గంటలకు అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించే రక్తదాన శిబిరంలో పాల్గొంటారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. అమలాపురం పట్టణ, అమలాపురం, అల్లవరం, ఉప్పల గుప్తం మండలాల పార్టీ అధ్యక్షుడు సంసాని బులనాని, గుత్తుల చిరంజీవి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జీ పట్టణం, మండలాల్లో నిర్వహించే వైఎస్సార్ జయంత్యుత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు.

గాడిమొగ గ్రామసభ రసాభాస



గాడిమొగ గ్రామసభలో వాగ్వాదానికి దిగిన నాయకులు

తాళ్లరేవు: గాడిమొగ గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా ముగిసింది. సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ పంచాయతీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను సభకు వివరించారు. ఈ సందర్భంగా 2వ వార్డు సభ్యుడు పోతాబత్తుల రాంబాబు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పంచాయతీ పాలక వర్గ సభ్యుల కారణంగానే గ్రామంలో అభివృద్ధి ఆగిపోయిందని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ మాట్లాడుతూ పంచాయతీకి ఏడాదికి రూ.3 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఆ లెక్కన నాలుగేళ్లలో సుమారు రూ.12 కోట్లు పైగా ఆదాయం సమకూరిందన్నారు. ప్రస్తుతం పంచాయతీ ఖజానాలో రూ.5 కోట్లు ఉన్నాయని, మిగిలిన రూ.7 కోట్లు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. దీనిపై సర్పంచ్ కామాడి గోవలక్ష్మి వివరణ ఇచ్చే సమయంలో కొందరు వ్యక్తులు కలుగజేసుకుని ఇష్టానుసారం మాట్లాడడంతో సభ రసాభాసగా మారింది. ఒక దశలో అదుపుతప్పి ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కోరంగి పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని, జగనన్న కాలనీలో సౌకర్యాలు కల్పించాలని, స్థానిక పాఠశాలలో మోనో కార్పస్ మొక్కలు తొలగించాలని పలువురు డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో నాయకులు కామాడి మాతరాజు, మల్లాడి వరదరాజు, సంగాడి కామేశ్వరరావు, మల్లాడి భైరవమూర్తి, వార్డు సభ్యులు, పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వరుస చోరీలు.. బెంబేలెత్తుతున్న వ్యాపారులు

సుంకరపాలెంలో ఒక్కరోజే 4 దుకాణాల్లో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న కోరంగి ఎస్సై సత్యనారాయణ సిబ్బంది

తాళ్లరేవు: ఆంధ్రా–యానాం సరిహద్దు ప్రాంతమైన సుంకరపాలెంలో వరుస చోరీల ఘటనలు వ్యాపారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఆరు నెలల్లో వరుసగా మూడుసార్లు దొంగలు పడి దోచుకుపోయారని వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివారం అర్ధరాత్రి ఒక్కరోజే నాలుగు దుకాణాల్లో దొంగలు చొరబడి నగదు, వస్తువులను అపహరించారు. యానాం–ద్రాక్షారామ రహదారిలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం సమీపంలోని వల్లీ ఎంటర్‌ప్రైజస్, సూర్య సిరామిక్స్, సుధా టైల్స్‌షాప్, సెలబ్రేషన్స్ దుకాణాల తలుపులను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం దుకాణాలకు వచ్చిన వ్యాపారులు చోరీ జరిగిన విషయం గుర్తించి వెంటనే వర్తక సంఘం అధ్యక్షుడు పుగాకు వాసుకు తెలియజేశారు. ఆయన కోరంగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, సిబ్బంది అక్కడికి చేరుకుని చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించారు. సీసీ టీవీ పుటేజీలను సేకరించి, క్లూస్ టీం ఫింగర్ ప్రింట్లను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ దర్యాప్తు వేగవంతం చేసి చోరీలకు పాల్పడిన వారిని పట్టుకుంటామని హామీ ఇచ్చారు. వరుస దొంగతనాలతో తీవ్రంగా నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేసారు. యానాం పోలీసులు వారి పరిధికాక పోయినప్పటికీ డబ్బులు వసూలు చేసుకోవడానికి వస్తున్నారు తప్ప ఎటువంటి రక్షణ కల్పించడంలేదని వ్యాపారులు ఆరోపించారు. రాత్రి వేళల్లో గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు ఎక్కువయ్యాయని కోరంగి పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని వారు కోరారు.

కళా వెంకట్రావు సేవలు చిరస్మరణీయం



అమలాపురం కళా వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోనసీమ జేఏసీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ అభివృద్ధికి ఆద్యుడు, అపర రాజకీయ చాణిక్యుడు రాష్ట్ర మంత్రి కళా వెంకట్రావు అని పలువురు వక్తలు అన్నారు. కోనసీమకు చెందిన కళా వెంకట్రావు 125వ జయంతిని పురస్కరించుకుని స్థానిక వడ్డిగూడెంలోని శ్రేయ ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, శ్రేయ ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణరావు మాట్లాడుతూ కోనసీమకు, గోదావరి జిల్లాలను కలుపుతూ రావులపాలెం, సిద్ధాంతంలో నిర్మించిన వంతెనలు నిర్మించి, గోదావరి జిల్లాల అభివృద్ధికి కారకుడైన కళా వెంకట్రావు సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దివంగత కళా వెంకట్రావు మనమలు, మనమరాళ్లు కళా వెంకట్రావు, సుభాషిణి, జితేంద్ర, మేనల్లుడు దువ్వూరి లక్ష్మీనారాయణ సోమయాజులు, డాక్టర్ ఆకెళ్ల వెంకట్రావు, దువ్వూరి సుబ్బలక్ష్మి తదితరులు ప్రసంగించి కళా వెంకట్రావు సేవలను గుర్తు చేశారు. వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోనసీమ జేఏసీ ఆధ్వర్యంలో..

స్థానిక కూచిమంచి అగ్రహారంలో గల కళా వెంకట్రావు విగ్రహానికి కోనసీమ జేఏసీ ప్రతినిధుల బృందం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. కన్వీనర్ బండారు రామమోహనరావు, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, మంత్రిప్రగడ వేణుగోపాల్, ఎస్.సంసోను, మాచిరాజు వాసు, టి.సుందరరామయ్య, పులపకుర్తి శ్రీనివాసరావు, బాదం సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

పార్కు నిర్వహణలో నిర్లక్ష్యం

గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వాకర్స్ ఫిర్యాదు



పార్కు దుస్థితిపై కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదు ప్రతిని చూపుతున్న వాకర్స్



దివ్యాంగురాలు ఉన్న ఆటో వద్దకే వచ్చి అర్జీ తీసుకుని పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ 26, 27వ వార్డుల పరిధిలోని చంద్రబాబునాయుడు ఆరోగ్య ఉద్యాన వనం (పార్కు) నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతం అసౌకర్యంగా మారిందని, వాకర్లు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వాకర్స్ వెళ్లి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి సమస్యను వివరించారు. పార్కులో గడ్డి, తుప్పలు, పిచ్చి మొక్కలు పెరగడంతో వాకింగ్ ట్రాక్‌పై నడవాలంటే భయంగా ఉంటోందని వాకర్స్ పేర్కొన్నారు. చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, బొమ్మలు, ఆట పరికరాలు ధ్వంసమయ్యాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి, కూటమి పార్టీల ముఖ్య నేతలకు పార్కు సమస్యను వివరించినా వారి నుంచి స్పందన కరువైందని పేర్కొన్నారు. వాకర్స్ కేఎస్ఎన్ మూర్తి, ఏవీ రమణ, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

ఆర్డీవో గ్రీవెన్స్‌కు సమస్యలపై అర్జీలు

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. ఆర్డీవో కొత్త మాధవి నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై ఫిర్యాదిదారులతో చర్చించారు. అర్జీదారులు ఆర్డీవోకు తమ సమస్యలను విన్నవించారు. మండలం పరిధిలో న్యాయం జరగక ఇక్కడికి వచ్చినట్టు వారు తెలిపారు. రాజోలు మండలం కడలి శివారు గంగరాని చెరువు ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలు బొంతు సుదర్శనం ఆర్డీవో కార్యాలయంలోకి రాలేని పరిస్థితి ఉంటే కార్యాలయం బయట ఆటోలో ఉన్న ఆ దివ్యాంగురాలి వద్దకు ఆర్డీవో వచ్చి ఫిర్యాదు పత్రాన్ని తీసుకున్నారు.

ఇంటి పట్టా కోరుతూ కలెక్టర్‌కు వినతి

అమలాపురం రూరల్: ఇంటి పట్టా ఇప్పించాలని, 25 ఏళ్లుగా పూరి గుడిసెలో నివసిస్తున్నామని అంబాజీపేట మండలం, ఇరుసుమండ జగ్గన్నతోట పంచాయతీ పరిధిలోని చిల్లి శ్రీనివాసరావు, కుమార్తె దివ్య శ్రీ కోరారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరుతూ ఆమె వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలంలో గుడిసె వేసుకుని నలుగురు జీవిస్తున్నామని, ఇటీవల పూరి గుడిసెను తొలగించాలని స్థానిక రైతు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకి, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌కు వినతిపత్రం అందజేశారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

యానాం: వేతన బకాయిలు చెల్లించాలని, ఏడవ వేతన సంఘ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఉద్యోగులు ధర్నా చేశారు. సీఎం రంగసామి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు పి.కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కె.రాంబాబు, కార్యదర్శి సీహెచ్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

అమలాపురం రూరల్: కామనగరువు జంగంపాలెం అగ్నిప్రమాదం బాధితులు వాసంశెట్టి పెద్దిరాజు, కుంచే శాంతమ్మకు అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు సాయం అందించారు. సోమవారం బాధిత కుటుంబాలకు సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ చేతులమీదుగా బియ్యం, వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులను గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జానకిరామయ్యకు పదోన్నతి

యానాం: స్థానిక ఫైర్‌స్టేషన్‌లో ఫైర్‌మెన్‌గా సేవలందిస్తున్న గాలి జానకిరామయ్యకు స్టేషన్ ఆఫీసర్ (స్పెషల్ గ్రేడ్–1) గా పదోన్నతి కల్పిస్తూ సోమవారం పుదుచ్చేరి అగ్నిమాపకదళ శాఖ డివిజినల్ ఫైర్ ఆఫీసర్ కె. ఇలంగో ఆదేశాలు జారీ చేశారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఫైర్‌మెన్లకు 39 మందికి పదోన్నతులు కల్పించారు. జానకిరామయ్యను పలువురు అగ్నిమాపకదళ సిబ్బంది అభినందించారు.


మట్టి అక్రమ తరలింపు

కాట్రేనికోన: పల్లంకుర్రు పంట కాలువ లాకు – 2 వద్ద సత్తమ్మ చెట్టు వద్ద మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. పల్లంకుర్రు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు మట్టి అక్రమ తరలింపుపై ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పంట కాలువ మట్టి తరలిస్తున్నా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో బూలవారి మొండి ఏటిగట్టును బలపరచకుండా ఇతర ప్రాంతాలకు మట్టిని తరలించుకు పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ ఎదురుగా ప్రయాణికులకు చెందిన పార్క్ చేసిన మోటారు సైకిళ్లను వరుసగా దొంగలిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ చోరీలకు పాల్పడుతున్న అమలాపురం రూరల్ మండలం బండార్లంక గ్రామానికి చెందిన గోళ్ల నాగ బసవరాజును పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని రూ.10 వేల నగదు సీజ్ చేసినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి అమలాపురం కోర్టులో హాజరుపరచగా జడ్జి అతనికి 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు. కొత్తపేట సబ్ జైలుకు బసవరాజును తరలించినట్లు సీఐ తెలిపారు. నాగ బసవరాజు చాకచక్యంగా అరెస్ట్ చేసిన ఎస్సై శ్రీనివాస్, సిబ్బందిని సీఐ వీరబాబు అభినందించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఎమ్మార్పీఎస్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఉప్పలగుప్తం: స్థానిక బాలయోగి పార్కులో 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీ సభ్యురాలు తాళ్ళ లక్ష్మీనరసాయమ్మ, తొత్తరమూడి నరసింహమూర్తి, చీకట్ల కిషోర్, నాగులపల్లి పాపయ్యరాజు పాల్గొన్నారు.

దండోరా స్తూపాల ఆవిష్కరణ

అల్లవరం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రెల్లుగడ్డ, కోడూరుపాడు, తూర్పులంకలో దండోరా స్తూపా లను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. యార్లగడ్డ రామకృష్ణ, ఆకుమర్తి మోహన్, బొమ్మి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గంపల సత్య ప్రసాద్, డీసీఎంఎస్ అధ్యక్షుడు పెచ్చెట్టి చంద్రమౌళి, బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.